


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAI ...మాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ బుధవారం 28-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 57 పేజీలు : 4 వెల : రూ 2-00

## 72 గంటల్లోగా షాజహాన్ ను అరెస్ట్ చేయాలి: గవర్నర్ డిమాండ్

సందేశ్ ఖాలీ అల్లర్ల కేసులో ప్రధాన నిందితుడైన షాజహాన్ షేక్ ను 72 గంటల్లోగా అరెస్ట్ చేయాలని పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ డిమాండ్ చేశారు. లేదంటే తాను స్వయంగా సందేశ్ ఖాలీ సందర్శిస్తానని హెచ్చరించారు.సందేశ్ ఖాలీలో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్ ను అరెస్ట్ చేయాలంటూ హైకోర్టు ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై గవర్నర్ ఆనందబోస్ మాట్లాడుతూ షాజహాన్ ను 72 గంటల్లోగా అరెస్ట్ చేయకపోతే, తాను సందేశ్ ఖాలీకి వెళ్లి అక్కడినుంచే విధులు నిర్వర్తిస్తానని చెప్పారు.

### ధరణిపై త్వరలో శ్వేత పత్రం..

## సమస్యల పరిష్కారానికి సదస్సులు



హైదరాబాద్: ఇరిగేషన్, ఆర్థిక, విద్యుత్ శాఖలపై విడుదల చేసినట్టుగానే త్వరలో ధరణి పై కూడా శ్వేత పత్రం విడుదల చేయబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.ఎంతో గొప్పగా చెప్పుతున్న ధరణి పోర్టల్ లో రైతులు, రైతు కూలీలకు ఉన్న ఐదు గుంటలు, పది గుంటలు భూమి కూడా నమస్యలోకి నెట్టబడిందన్నారు. ఆలోచన రహితంగా ధరణి ఏర్పాటు చేశారని విమర్శించారు. ప్రభుత్వ భూములను వారి సొంత భూములుగా మార్చుకోవడానికి ఒక కుట్రపూరితంగా ధరణిని ప్రవేశపెట్టారని విమర్శించారు. ధరణికి సంబంధించి గత ప్రభుత్వ పెద్దలు ఎన్ని వేల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసారో, ఎన్ని లక్షల కోట్ల ప్రజల సొత్తును కొల్లగొట్టారో త్వరలో ప్రజలముందు పెట్టబోతున్నామని తెలిపారు. భూరికార్డులకు శరాఘాతంగా పరిణమించిన ధరణి పోర్టల్ ను పూర్తిగా ప్రక్షాళన చేయబోతున్నామని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ పునర్నిర్మాణం" పై నిర్వహించిన సెమినార్ కు మంత్రిగారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూశాఖ, ధరణికి సంబంధించి గత ప్రభుత్వంలో వచ్చిన 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వీటి పరిష్కారానికి మార్చి 1వ తేది నుండి 7వ తేది వరకు ఎమార్వో స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. రాష్ట్రాన్ని విభజిస్తే, రాజకీయంగా తీవ్ర నష్టం జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతుందని తెలిసి కూడా ఆరు దశాబ్దాల

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాన్ని సోనియాగాంధీ నెరవేర్చారు. ఈ విషయాన్ని నేను చెప్పడం కాదు, అసెంబ్లీ లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రకటించారని చెప్పారు. ఏ ఉద్దేశ్యంతో, ఏ లక్ష్యంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో గత తొమ్మిదిన్నర సంవత్సరాల్లో అవి నెరవేరలేదని అన్నారు. అరవై ఏళ్ళ ఆకాంక్షలకు భిన్నంగా వ్యహరించారు.

## జీనోమ్ వ్యాలీ ఫేజ్-2పై సీఎం కీలక ప్రకటన..

### పెట్టుబడులతో 5 లక్షల ఉద్యోగాలు



హైదరాబాద్: త్వరలో హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రెండవ ఫేజ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైటెక్స్ లో హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ బయో ఏషియా 2024 సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు.ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డుకు ఎంపికైన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను సీఎం అభినందించారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సెమెంజాకు అవార్డును అందించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజీలను ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుంది' అన్నారు.కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని అన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతోందని గుర్తు చేశారు.ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కోవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కారాలను కూడా మనం కలిసికట్టుగానే సాధించాలని సీఎం సూచించారు. ఒక్క బయో సైన్సెస్ లోనే కాదు, ఐటీ–సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్ లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు."మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్ లా మా ప్రభుత్వం పనిచేస్తుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్–ఈ సంస్థతో కలిసి హైదరాబాద్ లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు.

## రూ.500లకే గ్యాస్ సిలిండర్.. గైడ్ లైన్స్ ఇవే

హైదరాబాద్,ఫిబ్రవరి 27కాంగ్రెస్ సర్కార్ మంగళవారం మరో రెండు గ్యారంటీలను ప్రారంభించనుంది. హామీ ఇచ్చిన ప్రకారం ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిన ప్రభుత్వం.. ఈరోజు సాయంత్రం చేవేళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభలో మరో రెండు గ్యారంటీలు.. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ స్కీమ్ తోపాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీమ్ ను ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే.. ఈ రెండు పథకాలకు సంబంధించిన గైడ్ లైన్స్ విషయంలో ప్రజల్లో అనేక అపోహాలు ఉన్నాయి. ఈ క్రమంలో రూ.500 గ్యాస్ పథకానికి సంబంధించి గైడ్‌లైన్స్ ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు జీవో జారీ చేసింది.

ఈ పథకానికి గైడ్ లైన్స్ ఇలా ఉన్నాయి..

సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం మూడు క్రైటీరియాలను ప్రకటించిన సర్కార్.

సిలిండర్ సబ్సిడీ కోసం ప్రజాపాలనలో అప్లై చేసిన వారు అర్హులు.

ఈ పథకానికి అర్హులుగా తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి చేసింది.

మూడు సంవత్సరాల వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని.. దాని యావరేజ్ ఆధారంగా సంవత్సరానికి సిలిండర్స్ కేటాయించనుంది

వినియోగదారులు మొదట మొత్తం డబ్బు చెల్లించాలి. ఆ తరువాత వినియోగదారుల ఖాతాలోకి తిరిగి సబ్సిడీ అమౌంట్ జమ చేయనుంది.

48 గంటల్లోనే వినియోగదారుల అకౌంట్‌లోకి సబ్సిడీ జమ చేయనున్నారు.

గ్యాస్ సబ్సిడీని ప్రభుత్వం నేరుగా ఓఎంసి సంస్థలకు ఇవ్వనుంది. సంస్థల నుంచి డిబిటి ద్వారా వినియోగదారుల ఖాతాల్లో ఆ నగదు జమ కానుంది.

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని ప్రభుత్వం మానిటరింగ్ చేయనుంది.



## ప్రతీసారి మేడిగడ్డ నుంచి ఎత్తిపోయాల్సిన అవసరం లేదు : కేటీఆర్




హైదరాబాద్, ఫిబ్రవరి 27 ప్రతీసారి మేడిగడ్డ నుంచి ఎత్తిపోయాల్సిర అవసరం లేదని కేటీఆర్ తెలిపారు. నీటి లభ్యత ఉన్న సమయంలో ఎల్లంపల్లి, మిడ్‌మానేరు నుంచి సైతం నీటిని లిఫ్ట్ చేయవచ్చన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ప్రతిపాదించిన తర్వాత.. ఆ ప్రాజెక్టు సమగ్ర స్వరూపం మారి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల దగ్గర బరాజ్‌లు, 141 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు.. 88 నుంచి 681 మీటర్లకు నీటిని లిఫ్ట్ చేయాలంటే.. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కట్టాలంటే బాహుబలి మోటర్లు కూడా పెట్టి.. 139 మెగావాట్ల సామర్థ్యం ఉండే మోటార్లను పెట్టి.. జలధార, జీవధార తెలంగాణకు కరువు అనేది తిరిగి చూడకుండా వరప్రధాయినిలా కాళేశ్వరాన్ని ప్రాజెక్టును నిర్మించారు. కొత్త ఆయకట్టు, స్థిరీకరించే ఆయకట్టు రెండు కలిపితే 40లక్షలకుపై చీలుకు ఎకరాలకు బృహత్తరమైన, తెలంగాణను సస్యశ్యామలం చేసే బృహత్తరమైన ఆలోచన కాళేశ్వరం' అన్నారు.ఆయకట్టు స్థిరీకరణ జరిగేలా..'ఎప్పుడూ చెబుతుంటారు పెద్దలు. ప్లాన్ ఏ ఉండాలి.. బీ కూడా ఉండాలి. ఒకటి విఫలమైనా.. ప్రత్యామ్నాయం ఒకటి ఉండాలని. అదే పద్ధతిలో ఆలోచనతో, ఇంజినీర్లు అందరూ కలిసి అహోరాత్రులు శ్రమించి ప్లాన్ చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం. ఇది మల్టిస్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ అని తెలుసు. ప్రతీసారి మేడిగడ్డ నుంచి ఎత్తిపోయాల్సిన అవసరం లేదు. ఒకవేళ కడెం ప్రాజెక్టు నుంచి ఓవర్‌ఫ్లో వచ్చి ఎల్లంపల్లికి వస్తే అక్కడి నుంచే నీళ్లు తీసుకోవచ్చు. ఒకవేళ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద వస్తే.. మిడ్‌మానేరు ద్వారా నీటిని ఎత్తిపోయవచ్చు. ఈ రెండు జరగని పక్షంలో మేడిగడ్డ నుంచి ఎత్తిపోసుకునే సౌలభ్యం ప్రాజెక్టులో ఇమిడి ఉంది. అత్యంత దుర్భిక్ష కరువు పరిస్థితి ఉన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా తెలంగాణ రైతాంగం ఇబ్బంది పడకూడదు. మంచినీటికి హైదరాబాద్ కూడా ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో కాళేశ్వరాన్ని నిర్మించుకోవడం జరిగింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, అప్పర్ మానేరు మధ్యతరహా ప్రాజెక్టుల ఆయకట్టు కూడా స్థిరీకరించేలా ప్రాజెక్టును డిజైన్ చేయడం జరిగింది' అన్నారు.'శివాలయంలా శిథిలమైపోయిన శ్రీరాంసాగర్ జలకళతో జీవం పోసుకున్నదంటే దానికి ముమ్మాటికి కారణం కాళేశ్వరమే. మా కండ్ల ముందే వరద కాలువలో పిల్లలు క్రికెట్ ఆడుకున్న పరిస్థితి ఉండే. కాకతీయ కాలువలో తుమ్మలు మొలిచిన పరిస్థితి. చొప్పదండి, కోరుట్ల, బోయినపల్లిలో వరద కాలువ గతంలో ఎలా ఉండేదో తెలుస్తుంది. కానీ, అదే వరద కాలువను రిజర్వాయర్‌లా మార్చి దాన్ని కూడా.. నీటి స్టోరేజీకి వాడుకొని.. చెరువులను నింపి.. లక్షల ఎకరాలకు నీరందించిన అద్భుతమైన ప్రాజెక్టు కాళేశ్వరం. కాకతీయ కాలువ ఆరు నెలల పాటు ఆగకుండా ఆరకుండా పారి ఇవాళ చివరి మడిని కూడా తడిపింది. ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కూడా తెలుసు'నన్నారు.'ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆయన భార్య ప్రాతినిథ్యం వహిస్తున్న హుజూర్‌నగర్, కోదాడతో పాటు తుంగతుర్తి, సూర్యాపేట, డోర్నకల్, మహబూబాబాద్ వరకు నీళ్లు వచ్చాయంటే కాళేశ్వరం నీళ్లేనని ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మనసునిండా తెలుసు.

## బీజేపీ సరికొత్త వ్యూహం..

### లోక్‌సభ ఎన్నికల బరిలో నిర్మలా సీతారామన్, జైశంకర్..!




ఢిల్లీ ,రానున్న లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చి నెలలో ప్రకటించనుంది. వరుసగా మూడోసారి అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది.రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి 100 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బీజేపీ కేంద్ర నాయకత్వం ఈ నెల 29న (గురువారం) విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. తొలి జాబితాలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితర పేర్లు ఉండే అవకాశముంది. తొలి జాబితాలో ఇంకా ఎవరెవరికి చోటు దక్కనుందన్న అంశం బీజేపీ వర్గాల్లోనూ ఆసక్తిరేపుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్ కూడా లోక్‌సభ ఎన్నికల బరిలో నిలపాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే వారు ఏ రాష్ట్రం నుంచి పోటీ చేస్తారు? ఏ నియోజకవర్గం నుంచి పోటీచేస్తారు? అనే అంశాలపై మాత్రం ఆ పార్టీ నేతలు నోరుమెదపడం లేదు.వీరిద్దరూ ప్రధాని మోదీ కేబినెట్‌లో అత్యంత ప్రాధాన్యత కలిగిన మంత్రులు. ప్రస్తుతం వారిద్దరూ పెద్దల సభలో సభ్యులుగా ఉన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి, జైశంకర్ గుజరాత్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యంవహిస్తున్నారు. వీరిద్దరూ సుదీర్ఘకాలంగా రాజ్యసభ నుంచి ప్రాతినిధ్యంవహిస్తున్నా.. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎప్పుడూ పోటీ చేయలేదు. ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో వీరిద్దరినీ పోటీ చేయించాలని పార్టీ యోచిస్తున్నట్లు మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. అయితే మీడియాలో కథనాలు వస్తున్నట్లు వారు కర్ణాటక నుంచి పోటీ చేస్తారా..? ఇతర రాష్ట్రాల నుంచి పోటీ చేస్తారా..? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

## విచారణకు రావాల్సిందే? కేజ్రీవాల్ కు ఎనిమిదోసారి ఈడీ నోటీసులు

ఢిల్లీ లిక్కర్ కేసులో విచారణకు రానంటే రానని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పట్టుపట్టుకుని కూర్చుంటే.. నువ్వు రావాల్సిందే అంటూ నోటీసుల మీద నోటీసులు ఇస్తోంది ఈడీ. ఇప్పటికే ఏడుసార్లు నోటీసులు ఇచ్చిన ఈడీ.. తాజాగా ఫిబ్రవవరి 27వ తేదీ మంగళవారం మరోసారి నోటీసులు ఇచ్చింది. వచ్చే నెల మార్చి 4వ తేదీన విచారాణకు ఈడీ కార్యాలయానికి రావాలని నోటీసులో తెలిపింది. మరి ఈసారి అయినా కేజ్రీవాల్ విచారణకు వెళ్తారో లేదో చూడాలి.మరోవైపు, విచారణకు పేరుతో కేజ్రీవాల్ ను అరెస్టు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇండియా కూటమి నుంచి వైదొలగాలని తమపై బిజెపి బెదిరింపులకు పాల్పడుతోందని.. కేజ్రీవాల్ ను అరెస్టు చేసి ఆప్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఈడీని అడ్డం పెట్టుకుని మోదీ సర్కార్ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు ఆప్ నేతలు.

## జూబ్లీహిల్స్ వివాదాస్పద భూమిపై హైకోర్టు కీలక ఆదేశాలు




హైదరాబాద్:జూబ్లీహిల్స్ వివాదాస్పద భూమికి సంబంధించి యథాస్థితి కొనసాగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన నందకుమార్‌కు శిక్ష ఖరారు చేసింది.నందకుమార్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధించింది. డెక్కన్ కిచెన్ హోటల్ లీజు విషయంలో దగ్గుపాటి ఫ్యామిలీకి నంద కుమార్‌కి వివాదం నడుస్తోంది. 2021లో నమోదు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నందకుమార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ పిటిషన్ వేశారు.

## హుస్నాబాద్‌లో హైటెన్షన్..

### భారీగా పోలీసుల మోహరింపు

సిద్ధిపేట జిల్లా: హుస్నాబాద్ మండలం రాములపల్లిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బండి సంజయ్ యాత్రను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు యత్నించారు.కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్‌లో బీజేపీ ఫ్లెక్సీలను కాంగ్రెస్ కార్యకర్తలు చించివేశారు.



హుస్నాబాద్ నియోజకవర్గంలో పోలీసులు మోహరించడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.తాను ఎవరిపైనా వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని బండి సంజయ్ అన్నారు

# సంపాదకీయం

బుధవారం 28-02-2024

## ముంచుకొస్తున్న ఎల్‌నినో ప్రభావం...

**కరువు తప్పదా...**

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకటించగా దీని ప్రభావం వల్ల లాటిన్ అమెరికా దేశాలతో పాటు ఇతర దేశాల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి.వాతావరణంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రుతుపవనాల రాకకు ఇంకా మూడు నెలల సమయం వున్నప్పటికీ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. 2024లో మార్చి నుంచి మే నెలల మధ్య సూపర్ ఎల్ నినో ప్రపంచాన్ని దెబ్బతీసే సూచనలున్నాయి.అమెరికాకు చెందిన ఎన్‌ఓఏ(నేషనల్ ఓషెనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్) సూపర్ ఎల్ నినో వచ్చే అవకాశం ఉందిన కొద్దిరోజుల కిందట అంచనా వేసింది. మార్చి నుంచి మే వరకూ వేసవి కాలం. ఈ కాలంలోనే ఎల్ నినో అత్యంత తీవ్రస్థాయికి చేరుకునే అవకాశం ఉంది.ఎన్‌ఓఏ చేసిన వాతావరణ సూచనల ప్రకారం, 2024 మార్చి నుంచి మే నెలల మధ్య సూపర్ ఎల్ నినో ప్రభావం కనిపించే అవకాశం ఉంది. తీవ్రమైన ఎల్ నినో కనిపించే అవకాశం 70 నుంచి 75 శాతం వరకూ ఉన్నట్లు అంచనా వేసింది.ఆ సమయంలో భూమధ్యరేఖ సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉంది.ప్రపంచవ్యాప్తంగా కేవలం 2 శాతం ఉష్ణోగ్రతలు పెరిగినా అది 30 శాతం కంటే ఎక్కువగా పెరిగినట్లే.1972?73, 1982?83, 1997?98 మరియు 2015?16లోనూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు అనేక దేశాలు తీవ్రమైన ఉష్ణోగ్రతలు, కరవు, వరదల వంటి విపత్తులను ఎదుర్కొన్నాయి.ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఒక రకమైన కాలానుగుణ మార్పు. ఈ ఎల్‌నినో వల్ల శీతాకాలాలు కూడా వెచ్చగా ఉంటాయి. వర్షం లేకుండా వేసవి కాలం మరింత వేడిగా మారనుంది. ఇక అవి మాత్రమే కాదు, దాని వల్ల రుతుపవనాలు కూడా బలహీనంగానే ఉన్నాయి. గత 20 ఏళ్లలో సంభవించిన కరవులన్నీ ఎల్‌నినో సంవత్సరాల్లోనే సంభవించాయని ఎంకె గ్లోబల్ పరిశోధనా నివేదిక చెబుతోన్న క్రమంలో ఈ సంవత్సరం వ్యవసాయోత్పత్తులు తక్కువగా ఉండవచ్చని అంటున్నారు. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని పరిశోధన నివేదికలు హెచ్చరిస్తున్నాయి. అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ మధ్య ఎల్‌నినో ప్రభావం 55 నుండి 60 శాతం వరకు ఉంటుందని అంచనా వేసింది. ఎల్‌నినో, లానినా అనేవి వాతావరణ పరిస్థితులకు సంబంధించినవి అనే సంగతి చాలా మందికి తెలుసు. కానీ అవి నిర్దిష్టంగా ఎందుకు ఏర్పడుతాయనే విషయం చాలా మందికి తెలియదు. నిజానికి శాస్త్రవేత్తలకు కూడా పూర్తిగా వీటి గురించి క్లారిటీ లేదనడం అతిశయోక్తి కాదు. ఎల్‌నినో అంటే వర్షాభావ పరిస్థితి కాగా, లానినా అంటే విపరీతంగా వర్షాలు కురిసే పరిస్థితి అనే ఒక్క మాటలో చెప్పే వివరణ.ఎల్‌నినో అంటే పెరూ తీరంలో ప్రతి 3 నుంచి 5 సంవత్సరాలకోసారి పసిఫిక్ జలరాశి అనూహ్యంగా వేడెక్కే స్థితి. ఎల్‌నినో అనేది ఒక స్పానిష్ (లాటిన్) పదం. లాటిన్ భాషలో ఎల్‌నినో అంటే క్రీస్తు శిశువు జననం. దీని కారణంగా భారత, ఆగ్నేయ ఆసియా దేశాల్లో రుతుపవన వ్యవస్థ దెబ్బతిని వర్షపాత పరిమాణం తగ్గుతుంది. మూడేళ్ళుగా పసిఫిక్‌పై వరుసగా లానినో పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ లానినో గత ఏడాది సెప్టెంబర్‌తో పూర్తయిపోయింది. ఇప్పుడు ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో భారత్‌లోకి ప్రవేశించే నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇచ్చే అవకాశం ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ ఎల్‌నినో 2027 వరకు కొనసాగుతుందని ఐరాస వాతావరణ విభాగం హెచ్చరించింది. దీని వల్ల భారత్ సహా చాలా దేశాల్లో కరవు పరిస్థితులు ఏర్పడవచ్చని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతాయని హెచ్చరించింది.ఎల్‌నినో పరిస్థితి ఎన్నడూ ఒకేలా ఉండదు. ప్రతి ఎల్‌నినో విభిన్నమైందే. ఒక్కోటి ఒక్కోలా ప్రభావం చూపుతుంది. ఎల్‌నినోతో వరదలు, కరవులు సంభవించడమే కాదు వాతావరణం వేడెక్కడం మరో సమస్య. పసిఫిక్ ఉపరితలం అధికంగా వేడెక్కడం వల్ల వాతావరణంలోకి పెద్ద మొత్తంలో శక్తి విడుదలవుతుంది. ఫలితంగా తాత్కాలికంగా ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎల్‌నినో సమయంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడానికి కారణమిదే.ప్రపంచంలోనే అతిపెద్దదైన పసిఫిక్ మహా సముద్రంలో బలంగా వీచే గాలులు, వాటి దిశ, ఉష్ణోగ్రత వంటి అంశాలు మొత్తం ప్రపంచ వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయవాతావరణంలో ఎల్ నినో ప్రభావం ఉన్నప్పుడే భారత్‌లో కరవు పరిస్థితులు ఏర్పడినట్లు గత అనుభవాలు చెబుతున్నాయి.అదే తరహాలో, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉండనున్న నేపథ్యంలో దేశంలో కరవు పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది.భారత్‌లో వర్షపాతానికి, ఎల్ నినోకు అవినాభావ సంబంధం ఉన్నట్లు మీడియా నివేదికలతో అర్థమవుతోంది. ఎందుకంటే, 1981 నుంచి ఇప్పటి వరకూ దేశంలో తలెత్తిన కరవు పరిస్థితులు 6 ఎల్ నినోల కాలంలోనే జరిగాయి. చివరగా 2002, 2009 కరవు పరిస్థితుల సమయంలోనూ ఎల్ నినోలు చురుగ్గా ఉన్నాయి.అయితే ఇందులో ఆసక్తికరమైన విషయం ఏంటంటే, భారత్‌లో కరవు పరిస్థితులు తలెత్తినప్పుడు ఎల్ నినో దాదాపుగా యాక్టివ్‌గా ఉంది. కానీ, ఎల్ నినో యాక్టివ్‌గా ఉన్న ప్రతి ఏటా భారత్‌లో కరవు పరిస్థితులు ఏర్పడలేదు.ఉదాహరణకు, 1997 - 98లో ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలో కరవు పరిస్థితి లేదు.ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల మధ్య విస్తరించి ఉండే పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడే ప్రత్యేక సముద్ర పవనాలు ఈ ఎల్‌నినో, లానినాలకు కారణం అవుతాయని అంచనా. పసిఫిక్ మహాసముద్రంలో, సాధారణ పరిస్థితుల్లో, గాలులు భూమధ్యరేఖ ద్వారా పశ్చిమంగా వీస్తాయి. అలా జరగడం వలన దక్షిణ అమెరికా నుండి వెచ్చని నీరు ఆసియా వైపు వస్తుంది. సముద్రపు లోతుల నుండి పైకి వచ్చే చల్లటి నీరు వెచ్చని నీటితో ప్రవహించే ఖాళీ స్థలాన్ని నింపుతుంది. అలాంటి ప్రాసెస్‌ను అప్‌వెల్లింగ్ అంటారు. ఎల్ నినో సహా లానినా ఈ పరిణామాన్ని నాశనం చేస్తాయి. మన దేశానికి లానినా ప్రభావం మంచిసూచన, అదే ఎల్‌నినో ప్రభావం ఉంటే జూన్ అక్టోబర్ మధ్య భారత దేశంలో రుతుపవనాలు ప్రభావితమవుతాయని అంటున్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబెట్టి ప్రజల ప్రాణాలతో చిలగాటం





బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, ఫిబ్రవరి 27( లోకం తీరు): బాల్కొండ నియోజకవర్గం వేల్పూరు మండలం పోచంపల్లి గ్రామ శివారులో రోడ్లపై ధాన్యం ఆరవేస్తూ సామాన్య ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు ఎన్నిసార్లు

**రోడ్లపై దాన్యం ఆరబెడితే కఠిన చర్యలు వేల్పూర్ పోలీసులు**

పోలీసులు హెచ్చరికలు జారీ చేసిన బేకా తయారు చేస్తున్నారు. వన్నెల్ బి నుండి పోచంపల్లి గ్రామానికి స్కూల్ బస్సు వెళుతుంది మార్గమధ్యంలో పోచంపల్లి శివారులో జొన్నలు ఆరబెట్టి అక్కడే రోడ్డుపై జొన్న పొట్టును కాల్చి వేస్తూ రోడ్డుపైనే ఉంచడం జరుగుతుంది దీనివల్ల ప్రమాదాలు ఎదురైతే ఎవరి బాధ్యులు అని సామాన్య ప్రజలు పోలీసులను ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ధాన్యాన్ని ఆరబెట్టేముందు వెళ్లడానికి దారి వదిలి ప్రజల ప్రాణాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. వేల్పూర్ సబ్ ఇన్స్పెక్టర్ వినయ్ రెడ్డిని వివరణ కోరగా ఆయన ప్రజలను ఉద్దేశించి వేల్పూర్ ప్రజలకి పోలీస్ వారీ విజ్ఞప్తి. రోడ్ పైన ఎటువంటి ధాన్యాలు అరబోయకుడదు. దీని వలన రోడ్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటాయని పదే పదే చెప్పిడం జరిగింది. రోడ్ ప్రమాదాలు పైన అవగాహన కార్యక్రమాలు చేపిట్టిన కూడా రైతులు వినడం లేదు. దేశానికి అన్నం పెట్టే రైతు, సామాన్య ప్రజల ప్రాణాలు తీసే రాక్షసుడు కాకూడదు. రేపటి నుండి రోడ్ పైన ధాన్యం ఆరబోసిన మరియు రాళ్లు పెట్టిన అట్టి వారి పైన క్రిమినల్ కేసులు వేయబడును.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలి

**అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**







నిజామాబాద్, ఫిబ్రవరి 27 (లోకంతీరు): ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం పాత కలెక్టరేట్ మై దానం నుంచి ప్రగతి హాస్పిటల్ వరకు, తిరిగి అక్కడి నుండి పాత కలెక్టరేట్ మైదానం వరకు 2కే నడక నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆర్థిక అక్షరాస్యత ఆవశ్యకతను గుర్తెరిగి, ప్రతి ఒక్కరు అవగాహన ఏర్పరుచుకోవాలని అన్నారు. తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని సూచించారు. ఈ దిశగా ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు ఆర్ బీ ఐ ద్వారా నిర్వహిస్తున్న అక్షరాస్యత వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.బీ.ఐ డీజీఎం సూర్యకాంత దాస్, రీజినల్ మేనేజర్ శ్రీకాంత్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.నవీన్ కుమార్, ఎన్.డి.సి.సి బ్యాంకు సీఈఓ నాగ భూషణం, పీ ఐ బి అధికారి ధర్మా నాయక్, ఖీఇఖఎ డైరెక్టర్ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు , ఆయా బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుండి ఇంటర్ పరీక్షలు...... సర్వం సిద్ధం...... ఇంటర్ విద్య అధికారి రఘురాజ్



నిజామాబాద్,ఫిబ్రవరి28(లోకంతీరు):నేటి నుండి ప్రారంభం కానున్నఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల (2024) నిర్వహణ కోసం జిల్లాలో సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యార్థి శ్రీ రఘురాజ్ తెలియజేశారు. ఫిబ్రవరి 28వ తేదీ నుండి మార్చి 19వ తేదీ వరకు జరిగే పరీక్షలకు జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రఘురాజ్ తెలియజేశారు. 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 2 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, 2 సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలు, 6 మోడల్ జూనియర్ కళాశాలలు, 2 మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, ఒక బీసీ సంక్షమ జూనియర్ కళాశాల, 26 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాటశాల, ఒక ప్రైవేట్ పాఠశాల పరీక్షల నిర్వహణ కోసం ఉపయోగిస్తున్న మని తెలిపారు.జిల్లాలో మొత్తం 35,346 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఇంటర్ విద్య అధికారి తెలిపారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 14,965 మంది, 2,399 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారని అన్నారు. రెండవ సంవత్సరం రెగ్యులర్ జనరల్ విద్యార్థులు13,986 మంది, ప్రైవేట్ 1,804 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం ఒకేషనల్ రెగ్యులర్ 1,999 మంది విద్యార్థులు, ప్రైవేట్ 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని జిల్లా ఇంటర్ విద్య అధికారి తెలిపారు. మొదటి సంవత్సరం మొత్తం విద్యార్థులు 17,364 కాగా రెండవ సంవత్సరం విద్యార్థులు 17,982 మంది ఉన్నారని తెలిపారు.నిమిషం నిబంధన అమలు ......నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రం లోకి విద్యార్థులకు అనుమతి ఉండదని జిల్లా ఇంటర్ విద్యా అధికారి రఘురాజ్ తెలిపారు. ఉదయం 8.30 గంటల వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ లను, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ ను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇతర ఏ పత్రాలను, కాగితాలను కూడా అనుమతించబోమని అన్నారు. పరీక్షల నిర్వహణ లో చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని అన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకునే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు టి.ఎస్. ఆర్టీసి బస్సులు నడపడానికి ఆర్టీసి అధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడం జరుగుతుందని అన్నారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రం లో ఒక ఏ. ఎన్. ఏం. తో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు. అలాగే పరీక్ష పూర్తైన తర్వాత జవాబు పత్రాల బెండల్ లను పోస్ట్ ఆఫీస్ ల ద్వారా వాటిని జిల్లా కేంద్రం లోని డి.ఆర్.డి. సి. కేంద్రానికి తరలించే ఏర్పాట్లు పోస్ట్ ఆఫీసు ల ద్వారా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మాల్ ప్రాక్టీస్ నివారణకు మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణ పర్యవేక్షిస్తారని తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందంలో రెవెన్యూ అధికారి, పోలీస్ అధికారితో పాటు ఒక సీనియర్ అధ్యాపకుడు ఉంటారని తెలిపారు. ఏ సమస్య ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలోనీ ఇంటర్ విద్యా కార్యాలయంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీ రవికుమార్, శ్రీ రజీయుద్దిన్ ఆస్లామ్, శ్రీ దేవరామ్ లు అందుబాటులో ఉంటారని అన్నారు.విద్యార్థులు ఎలాంటి పుకార్లు నమ్మరాదు.....పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యార్థులు ఎలాంటి పుకార్లు నమ్మవద్దని జిల్లా ఇంటర్ విద్యా అధికారి సూచించారు. పరీక్ష రాసే సమయంలో విద్యార్థిని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోను కారాదని అన్నారు. బాగా చదివి ప్రతి ప్రశ్న కు సమాధానం రాయాలని సూచించారు. ఆన్లైన్ ద్వారా కూడా హాల్ టిక్కెట్లు......హాల్ టికెట్ ల పంపిణీ విషయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్ఇవ్వకపోయినా ఆన్లైన్ ద్వారా కూడా డౌన్లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపారు. ఈ హాల్ టికెట్ పైన ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని అన్నారు. టి.ఎస్. బీ . ఐ.ఈ ఆన్లైన్ లో విద్యార్థులు హాల్ టికెట్ లు పొందవచ్చన్నారు.

## కాసులు పెట్టి కొన్న కడుపు నింపని భూవివాదం

**పట్టించుకోని నాథుడే లేడు - విసిగిపోయిన కొనుగోలుదారుడు**



బాల్కొండ నియోజకవర్గ ప్రతినిధి , ఫిబ్రవరి 27 ( లోకం తీరు): నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం సికింద్రాపూర్ గ్రామంలో గత 20 సంవత్సరాల క్రితం రెండు ఎకరాల భూమి కోనేరు బాలగంగాధర్ కొనుగోలు చేయగా అట్టి భూమిని సాగు చేయనీయకుండా గ్రామ అభివృద్ధి కమిటీ అడ్డుపడుతుందని మంగళవారం రోజు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తన వద్ద ఉన్న భూమి కొనుగోలు చేసిన పత్రాలను పట్టా కాగితాలు అన్ని సాక్షాధారాలతో తహసిల్దారు అధికారికి చూపించి తమకు న్యాయం చేయాలని కోరారు ఇదిలా ఉండగా గత సోమవారం నాడు సికింద్రాపూర్ గ్రామ కమిటీ గ్రామ ప్రజలు తహసిల్దారు కార్యాలయంలో చేసిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదని కోనేరు బాలగంగాధర్ అలాగే తాను కొన్న భూమిలో హద్దురాల్లను తొలగించి ఆస్తి నష్టం కలిగించిన వారిని శిక్షించి తమకు న్యాయం చేయాలని స్థానిక తహసీల్దార్ మరియు పోలీస్ ఉన్నతాధికారులను కోరారు.

## వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అభిమానుల పాదయాత్ర

**-- కొనరావ్ప పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు**


**-- షేక్ ఫిరోజ్ పాష**



కామారెడ్డి జిల్లా రామారెడ్డి ఫిబ్రవరి 27, లోకం తీరువేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ తరఫున గెలుపొందిన శుభ సందర్భంగా ఎమ్మెల్యే అభిమానులు సీనియర్ కార్యకర్త కొనరావుపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా తో పాటు మంగపల్లి శోభన్ బాబు, తాళ్లపల్లి ప్రభాకర్,మంగళవారం వేములవాడ నుండి కామారెడ్డి జిల్లా బడా పహాడ్ దర్గా వద్దకు బయలు దేరడం జరిగింది. పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో రామారెడ్డి మండలం కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు వారిని ఘనంగా సత్కరించి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కొనరావుపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ షేక్ పాషా మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపొందిన శుభ సందర్భంగా పవిత్రమైన దర్గా బడాపహాడ్ కు పాదయాత్రతో వస్తామని మొక్కులు చెల్లించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయణం మండల సీనియర్ కార్యకర్తలు ఫారుక్, రాహుఫ్, నామాల లింబాద్రి,బిపేట నర్సింలు, వడ్ల లక్ష్మి రాజ్యం,పిప్పరి గణేష్, అజ్గాన్ తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులు.

బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-పోతంగల్ రెవెన్యూ కార్యాలయంలో అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించడం లేదు.ఉదయం 10:30 గంటలకే విధులకు హాజరుకావల్సిన అధికారులు,సిబ్బంది గంటల తరబడి ఆలస్యంగా వస్తున్న పట్టించుకునే వారే లేరు.తద్వారా కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. ఉన్నత అధికారి కోసం ప్రజల ఎదురుచూపులు తప్పడం లేదు.ఎన్నో ఆశలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారి సమస్యలు వినేవారు లేకపోవడంతో చేసేదేమీ లేక నిరుత్సాహంతో ప్రజలు వెను తిరుగుతున్నారు. ఇప్పటికైనా సమయపాలన పాటించని ఉద్యోగులను గుర్తించి సస్పెండ్ చేయాలని ప్రజలు ఉన్నత అధికారులను ఉన్నత కోరుకుంటున్నారు





## హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటే : హరీశ్‌రావు



హైదరాబాద్ : హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింది అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి రాగానే, ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పిందని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందన్నారు.నో ఎల్‌ఆర్‌ఎస్ ? నో బీఆర్‌ఎస్ అంటూ గతంలో ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజులు వసూలు చేస్తామనడం కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలి. లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నా అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్ కు అలవాటుగా మారింది. అధికారంలోకి రాగానే, ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని, ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, నేడు మాట తప్పింది. ఎల్ ఆర్ ఎస్ పేరిట ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైంది.

## క్రాస్ ఓటింగ్.. హిమాచల్‌లో ప్రమాదంలో కాంగ్రెస్!



ఢిల్లీ: ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో జరుగుతున్న రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు భారీగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడుతున్నారు. యూపీలో బీజేపీ ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ వేస్తున్నట్లు తెలుస్తోంది.సమాజ్‌వాదీ పార్టీ మూడవ అభ్యర్థి ఓడిపోయే అవకాశం ఉంది. ఇక.. హిమాచల్ ప్రదేశ్‌లోనూ 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడట్టు తెలుస్తోంది. ఇంత భారీ స్థాయిలో క్రాస్ ఓటింగ్ జరిగితే.. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడనుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.68 మంది ఎమ్మెల్యేలున్న హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 40 ఎమ్మెల్యేల మద్దతు ఉండగా.. బీజేపీకి కేవలం 25 ఎమ్మెల్యేల మద్దతు మాత్రమే ఉంది. కాంగ్రెస్ కూడా ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. బీజేపీకి తగిన సంఖ్యాబలం లేకపోయినా.. రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టడం గమనార్హం.

## వారంలోగా హమాస్ - ఇజ్రాయెల్ మధ్య సంధి.. జో బైడెన్ కీలక ప్రకటన..

గాజాలో హమాస్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక ప్రకటన చేశారు. దీంతో పెను ముప్పు పొంచి ఉన్న సమయంలో యుద్ధంలో చితికిపోతున్న గాజా జనానికి ప్రాణం లేచి వచ్చినట్టు అనిపిస్తోంది.వచ్చే సోమవారం అంటే మార్చి 4వ తేదీ నాటికి రెండు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ వచ్చే అవకాశం ఉందన్నది బైడెన్ మాట. ఖతర్‌లో ఇజ్రాయెల్-గాజా దేశాల ప్రతినిధుల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చాయని? వీలైనంత త్వరలో ఒక ఒప్పందానికి వచ్చే అవకాశం ఉందని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు తనతో చెప్పారన్నది ఆయన మాటల సారాంశం. అయితే ఇప్పటి వరకు ఒక నిర్దిష్ట ఒప్పందం ఏదీ కుదరలేదని బైడెన్ చెప్పారు. అయితే ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌కు ముందే తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశమున్నట్లు తెలుస్తోంది. బైడెన్ చెప్పినట్లు గాజాలో కాల్పుల విరమణ జరిగితే.. ఆకలి చావుల అంచున ఉన్న గాజా ప్రజల నోట్లో అమృతం పోసినట్టే. గాయాలకు మందుల్లేక? ఆస్పత్రుల్లో అల్లాడుతున్న క్షతగాత్రుల ప్రాణాలకు ఆశలు కల్పించినట్టే.కాల్పుల విరమణ తాత్కాలికం కావచ్చు? షరతులు వర్తిస్తాయ్ అని ఎలుగెత్తి చెప్పొచ్చు. అయినా సరే? సరిహద్దుల ఆవలే ఆగిపోయిన సాయం? ఈవలకు రావాలని? కేవలం గాజా ప్రజలు మాత్రమే కాదు.. వారి కష్టాలు.. కన్నీళ్లను? ఆకలి బాధల్ని అక్కడే ఉండి కళ్లారా చూస్తున్న ఏమీ చేయలేకపోతున్న అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు కోరుకుంటున్నాయి. ఈ మానవీయ సంక్షోభానికి ఇకనైనా ముగింపు పలకాలన్నదే వారి ఆశ. అందుకే ఇప్పుడు బైడెన్ మాటలకు అంతటి విలువ.సరిగ్గా 2023 అక్టోబర్ 7న ఈ దారుణ మారణ కాండకు బీజం పడింది. దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేసి 1200 మందిని చంపేయడం? 253 మందిని బంధీలుగా పట్టుకెళ్లడం ఇజ్రాయెల్ ఆగ్రహానికి అసలు కారణం. ఇప్పటి వరకు ఈ పరస్పర దాడుల్లో సుమారు 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.



# ఖాతాదారులపై ఛార్జీల దాడి

### మొండి బకాయిలపై నిర్లక్ష్యం
### బ్యాంకుల తీరుతో సామాన్యులపై భారం

ముంబయి,ఫిబ్రవరి27: దేశంలో బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారి విషయంలో ఎలాంటి చర్యలు కానరావడం లేదు. కొందరు దేశం విడిచి పారిపోయారు. వారు ఇప్పట్లో తిరిగి వస్తారని కానీ, ఎగవేసిన రుణాలను చెల్లిస్తారన్న ఆశలు మాత్రం కానరావడం లేదు. గత పదేళ్లుగా ఇది చూస్తూనే ఉన్నాం. నల్లధనం తీసుకురాలేదు. ఎగవేతదారులను పట్టి తేలేక పోయాం. ఇకపోతే కాలక్రమేణా బ్యాంకులు సామాన్యలకు దూరం అవుతున్నాయి. రకరకాల ఛార్జీలతో ఖాతాదారులను వేధిస్తున్నారు. ఎటిఎం మొదలు ఎలాంటి పనికైనా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించక పోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది. బ్యాంకుల తీరు కారణంగా బ్యాంకుల్లో డబ్బు దాచుకునేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఖాతాదారులకు అండగా ఉండాల్సిన బ్యాంకులు పనితీరు రానురాను వారినుంచి ముక్కుపిండి ఏ రూపంలో డబ్బులు వసూలు చేయాలో అన్న రీతిలో ఉంటున్నాయి.ఇకపోతే మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. పెద్దనోట్ల రద్దు తరవాత ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండిబకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాబై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి.

50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. 2017 మార్చి 31 నాటికి బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ.8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ చీఫ్ వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీలు వాల్యుయేషన్, కమోడిటీతో మిలితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు.

# హనుమ విహారికి రాజకీయ పార్టీల అండ

### అధికార పార్టీ తీరుపై నేతల ఆగ్రహం
### వైకాపా తీరును ఎండగట్టిన బాబు,షర్మిల, పవన్ కళ్యాణ్

అమరావతి,ఫిబ్రవరి27: క్రికెటర్ హనుమ విహారికి రాజకీయ పార్టీలన్నీ అండగా నిలిచాయి. రాజకీయాలకు తన ఆటను దూరం చేసుకోవద్దని సూచించాయి. అలాగే అధికార పార్టీ తీరుపై నేతల ఆగ్రహం వ్యక్తం చేశాయి. వైకాపా తీరును ఎండగట్టిన బాబు,షర్మిల, పవన్ కళ్యాణ్ ..ష్ట్రంలో వైసీపీ రాజకీయ కక్షలకు, ప్రతీకార రాజకీయాలకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ లొంగిపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇంతకన్నా దారుణం ఉండదని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. క్రికెటర్ హనుమవిహారి విషయంపై మంగళవారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. ప్రతిభావంతుడైన క్రికెటర్ హనుమ విహారి.. ఏపీ తరఫున ఎప్పటికీ ఆడబోనని ప్రకటించేలా వేధించారని ఆరోపించారు. హనుమవిహారి కి తాము అండగా ఉండి అతనికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. 'హనుమ విహారి ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఆట పట్ల అతనికున్న చిత్తశుద్ధిని వైసీపీ కుట్రా రాజకీయాలు నీరు గార్చలేవు. అన్యాయమైన చర్యలను ఏపీ ప్రజలు ప్రోత్సహించరని అన్నారు. క్రికెటర్ ఆనంద్ విహారీ వ్యవహారంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఇంతకంటే సిగ్గుచేటు విషయం ఇంకేమన్నా ఉంటుందా? అని ప్రభుత్వం తీరుపై ఫైర్ అయ్యారు. అన్నింటిలో నీచ రాజకీయాలు ఆడుతున్న వైసీపీ వాళ్ళు.. ఇప్పుడు క్రీడలను కూడా వదలడం లేదని విమర్శించారు. వైసీపీ నేతల దౌర్భాగ్య రాజకీయాలకు క్రీడలకు బలి చేయడ మేంటని నిలదీశారు. క్రీడలు, క్రీడాకారులపై అధికారమదాన్ని చూపుతున్నారని షర్మిల మండిపడ్డారు.రాష్ట్ర ప్రతిష్ఠను అన్నివిధాలుగా నాశనం చేసిన వైసీపీ నేతలు.. ఇంకా ఎంత లోతులకు దిగజార్చుతారో ఊహించలేమని షర్మిల వ్యాఖ్యానించారు. 'ఆడుదాం ఆంధ్ర' అంటూ రెండు నెలలు సినిమా స్టంట్స్ చేయించిన వైసీపీ నేతలు.. అసలు ఆడుతున్న ఆటలు ఇవేనా? అని ప్రశ్నించారు. ఆటగాళ్ల భవితను, ఆత్మవిశ్వాసాన్ని ఇలా నాశనం చేస్తారా? అని ఫైర్ అయ్యారు. ఇది ఆంధ్ర క్రికెట్ అస్సోసియేషనా లేకా అధ్వానపు క్రికెట్ అస్సోసియేషనా? అని నిలదీశారు. ఈ వ్యవహారంపై వెంటనే ప్రభుత్వం స్పందించాలని, నిస్పాక్షికమైన విచారణ జరిపించాలని షర్మిల డిమాండ్ చేశారు. క్రీడలు, క్రీడాకారుల విషయంలో వైసీపీ నేతల ఆగడాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారత క్రికెటర్, ఆంధ్ర రంజీ జట్టు మాజీ కెప్టెన్ హనుమ విహారికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంఘీభావం తెలియచేస్తూ పోస్ట్ చేశారు. భారత క్రికెటర్ కంటే వైసీపీ నాయకుడే ముఖ్యమా? అని ప్రశ్నించారు. భారత క్రికెట్ జట్టుకి 16 టెస్టు మ్యాచుల్లో ప్రాతినిధ్యం వహించి ఐదు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ సాధించి... ఆస్ట్రేలియాతో జరిగిన సిడ్నీ టెస్టు లో కనబరిచిన అతని క్రీడా పటిమ మరువలేనిదని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రంజీ జట్టు కెప్టెన్‌గా, గత ఏడేళ్లలో ఆంధ్ర జట్టు అయిదు సార్లు నాకౌట్‌కు అర్హత సాధించడంలో సహాయపడిందన్నారు. విరిగిన చేతితో పాటు.. మోకాలి గాయంతో హనుమవిహారి ఆడారని, భారత్ జట్టు కోసం, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ జట్టు కోసం తన క్రీడా శక్తినంతటినీ ధారపోశారన్నారు. ఈరోజు ఒక వైసీపీ కార్పొరేటర్ కారణంగానే.. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు విహారి తన కెప్టెన్సీకి రాజీనామా సమర్పించాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌కు - భారత క్రికెటర్, ఆంధ్రప్రదేశ్ రంజీ టీమ్ కెప్టెన్ కంటే.. ఎటువంటి క్రికెట్ బ్యాక్‌గ్రౌండ్ లేని స్థానిక వైసీపీ రాజకీయ నాయకుడు చాలా విలువైన వ్యక్తిగా మారటం.. ఎంత అవమానమని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి గారూ! మన ఆంధ్రా క్రికెట్ టీమ్ కెప్టెన్‌ని రాష్ట్ర క్రికెట్ సంఘం దారుణంగా అవమానించినప్పుడు.. 'అడుదాం ఆంధ్రా' లాంటి కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి లాభమేంటి?.. ప్రియమైన హనుమ విహారి, మీరు రాష్ట్రానికి, దేశానికి ఛాంపియన్ ప్లేయర్.. మీ విశిష్ట సేవలతో... ఆంధ్రలోని చిన్న పిల్లల్లో స్ఫూర్తిని నింపి.. క్రీడాకారులను ఉత్తేజపరిచినందుకు మీకు ధన్యవాదాలు.. తెలుగువారిగా.. క్రికెట్‌ను అమితంగా ఇష్టపడే వ్యక్తులుగా.. మీకు జరిగిన అన్యాయానికి మన రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ మీ పట్ల చూపిన వివక్షత.. చూపిన తీరుకు మేము చింతిస్తున్నాము. మీకు భవిష్యత్తులో మంచి జరగాలని కోరుకుంటున్నాను. అలాగే.. ఆటగాళ్లను గౌరవించడం తెలిసిన స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌తో మీరు వచ్చే ఏడాది మళ్లీ ఆంధ్రా తరపున ఆడతారని నేను విశ్వసిస్తున్నాను' అంటూ పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో రాజకీయ పెత్తనం మరోసారి రచ్చకెక్కింది. రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు క్వార్టర్ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించిన హనుమ విహారి ఏసీఏలో జరుగుతున్న రాజకీయాలను బహిర్గతం చేశాడు. ఈ ఏడాది రంజీ సీజన్ మధ్యలోనే తాను ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో వెల్లడించాడు. రాజకీయ నేతల జోక్యంతోనే కెప్టెన్సీ నుంచి తప్పుకొన్నానని సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ పెట్టాడు. జట్టుకు సంబంధించిన విషయంలో ఓ రాజకీయ నేత కుమారుడైన ఆటగాడితో గొడవ జరిగినందుకు ఏసీఏ పెద్దలు తనపై వేటు వేశారని ఆరోపించాడు. ఇది తనను ఎంతో వేదనకు గురి చేసిందనీ, భవిష్యత్‌లో ఆంధ్ర జట్టుకు ఆడేదే లేదంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నాడు.

# రైతు బంధు, రైతుబీమా పేరుతో దోపిడి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 రైతుబంధు, రైతు బీమా పథకం డబ్బులు పక్కదారి పడుతున్నట్లు వస్తున్న వార్తలు తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారింది. దీంతో ఈ వ్యవహారంపై పోలీసులు నిఘా పెట్టారు.నకిలీ పత్రాలతో రైతు బంధు,రైతు భీమా డబ్బులు కాజేస్తున్నారని రంగారెడ్డి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.గత కొన్నేళ్ళ నుంచి రైతుబంధు, బీమా డబ్బులను నిందితులు విత్ డ్రా చేసుకొని తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లు వెలుగులోకి రావడంతో అధికారులు షాక్ తిన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి..... నకిలీ వ్యక్తుల పేర్లతో డబ్బులు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. భూములు లేకపోయినా ఉన్నట్లుగా సృష్టించి..... రైతుబంధు,రైతు బీమా పథకాలు డబ్బులను తీసుకున్నట్టు తెలిపారు.నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు లోతైన విచారణ చేపట్టారు. అయితే దీనిపై సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చారు.రంగారెడ్డి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ఫిర్యాదుతో రైతుబంధు, రైతు భీమా మీద పథకం డబ్బులు కొట్టేసినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో 20 రైతు భీమా క్లెయిమ్ లు జరిగినట్లు వెల్లడించారు.అయితే ఈ 20 క్లెయిమ్స్ అనుమానాస్పదంగా ఉన్నాయని అగ్రికల్చర్ ఆఫీసర్ తమతో చెప్పినట్లు సీపీ పేర్కొన్నారు. ఈ 20 రైతు భీమా క్లెయిమ్స్ ద్వారా సుమారు రూ.కోటి రూపాయల ఎల్ఐసి అమౌంట్ రైతు భీమా కింద డైవర్ట్ చేసినట్లు అవినాష్ మహంతి వెల్లడించారు. సుమారు 130 నకిలీ పట్టాధారులను సృష్టించి రైతు బంధు స్కీం లో క్లెయిమ్ చేశారన్నారు.ఇందులో కొంత మంది అప్పటికే మరణించి ఉన్నారని సంచలన విషయాలు భయట పెట్టారు.కందుకూరు మండల పోలీస్ స్టేషన్లో ఏఈఓ గోరటి శ్రీశైలం తో పాటు వీర స్వామిని అరెస్ట్ చేశామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పేర్కొన్నారు. 2000 మంది రైతులకు దక్కాల్సిన రైతు బంధు, రైతు భీమా డబ్బును మళ్లించి...? డెత్ సర్టిఫికెట్ లో పైన కింద ఒరిజినల్ అని ఉంటుందనీ..... కానీ మధ్యలో ఉండే పేర్లు, ఇతర వివరాలను ఏఈఓ శ్రీశైలం మార్ఫింగ్ చేసినట్లు ఆయన వివరించారు. ఈ డబ్బుతో ఏ ఈ ఓ శ్రీశైలం వ్యవసాయ భూమిని కొనుగోలు చేసినట్లు అవినాష్ మహంతి తెలిపారు.తన బంధువులు, ఇతర కుటుంబ సభ్యులకు భూములు ఉన్నాయని తనకు మాత్రమే లేకపోవడంతోనే ఇలా చేసినట్లు నిందుతుడు శ్రీశైలం ఒప్పుకున్నట్లు సీపీ పేర్కొన్నారుఏకంగా 2000 మంది రైతులకు సంబంధించిన రైతు బంధు,రైతు భిమను శ్రీశైలం మరియు వీర స్వామి గత కొన్నాళ్లుగా కానేస్తునట్లు చెప్పుకొచ్చారు.రైతులు రైతు బంధు,భీమా పథకాల డబ్బు గురించి నిలదీసిన ప్రతీ సారి ఏదో ఒక సాకు చెప్పే వాడని సీపీ వివరించారు. వీరస్వామితో ఏడు బ్యాంక్ అకౌంట్లు ,జాతీయ బ్యాంకులలో ఎకౌంట్లు క్రియేట్ చేశాడని.....ఏటీఎం బ్యాంక్ పాస్ బుక్ లు మాత్రం తన వద్దే పెట్టుకునే వాడని తెలిపారు. ఏఈఓ అక్రమంగా కొనుగోలు చేసిన భూమిని,ఇతర ఆస్తులను,నగదును ఏసీబీకి అప్పగిస్తామని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వెల్లడించారు.

టెలిగ్రామ్ యాప్ లో పరిచయం,
పెట్టుబడి పేరుతో రూ.50 లక్షలు మోసం

ఇటీవల పెట్టుబడి పేరుతో ఓ మహిళ నుంచి రూ.50 లక్షలు కొట్టేశారు సైబర్ కేటుగాళ్లు. ఈ కేసు దర్యాప్తులో పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. దుబాయ్ లో నుంచి ఓ వ్యక్తి స్థానికంగా ఇద్దరు వ్యక్తులతో ఈ దందా నడిపించినట్లు గుర్తించారు. సామాజిక మధ్యమల ద్వారా పెట్టుబడుల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన ఓ మహిళకు టెలిగ్రామ్ యాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా వారు తాము సూచించిన యాప్ లలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ఆమెకు వాటికి సంబంధించిన లింకులు పంపి సదరు మహిళ నుంచి పలు దఫాలుగా రూ.49,45,900 లను కాజేసి ఆమెను మోసం చేశారు.

## ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ ల సమావేశం






నిజామాబాద్,ఫిబ్రవరి 28(లోకంతీరు):తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డ్ కమిషనర్ ఆదేశాలు, నిభందనల మేరకు జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు గాను ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రఘురాజ్, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీ రవికుమార్, శ్రీ రజీయుద్దిన్ ఆస్లామ్, శ్రీ దేవరామ్ లు తెలియజేశారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయంలో ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు సమావేశం జరిగింది. ఫిబ్రవరి 28 వ తేదీ నుండి ప్రారంభం అవుతున్న ఇంటర్ పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లైయింగ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశమని అన్నారు. ఈ బృందాలు ప్రతిరోజు జిల్లా లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తారని అన్నారు. పరీక్ష కేంద్రంలోని విద్యార్థుల వద్ద ఎలాంటి చీటీ లు లభించిన మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేయబడతాయని అన్నారు.



## రాడిసన్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

### తెరపైకి డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి పేరు
### సినీ సెలబ్రిటీల పాత్రపైనా పోలీసులు ఆరా

హైదరాబాద్,ఫిబ్రవరి27 : గచ్చిబౌలి రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో టాలీవుడ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి పేరు తెరపైకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో గచ్చిబౌలి పోలీసులు డైరెక్టర్ క్రిష్ పేరును చేర్చారు. క్రిష్ పేరు తెరపైకి రావడంతో మరోసారి టాలీవుడ్ ఇండస్ట్రీలో డ్రగ్స్ కలకలం మొదలైంది. మరికొందరు సినీ సెలబ్రిటీల పాత్రపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. డ్రగ్స్ పెడ్లర్ అబ్బాస్ స్టేట్‌మెంట్‌లో క్రిష్ పేరు ప్రస్తావించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పార్టీ జరిగే సమయంలో వివేకానందతో పాటు.. రాడిసన్ హోటల్‌లో డైరెక్టర్ క్రిష్ ఉన్నట్లు తెలిపారు. గజ్జెల వివేక్ నిర్వహించిన పలు పార్టీలకు క్రిష్ హాజరైనట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ కేసులో ఆయన పేరును కూడా చేర్చారు. అయితే, ఆయన డ్రగ్స్ తీసుకున్నారా లేదా అనేది తెలియాల్సి ఉంది. హైదరాబాద్‌లోని స్టార్ హోటల్‌లో డ్రగ్స్‌తో పార్టీలు చేసుకుంటున్న రాజకీయ, వ్యాపార, సినీ పరిశ్రమతో సంబంధమున్న ముఠాను ఎస్‌వోటీ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో సీపీ అవినాశ్ మహంతి వెల్లడించిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని ర్యాడిసన్ బ్లూ హోటల్‌లో కొకైన్‌తో డ్రగ్ పార్టీ జరుగుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు హోటల్‌పై దాడిచేశారు. అప్పటికే ముఠా పరారు కావడంతో పార్టీ నిర్వాహకుడైన మంజీర గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ గజ్జల వివేకానంద ఇంటికి వెళ్లి సోదాలు చేశారు. అక్కడాయనకు పరీక్షలు నిర్వహించగా డ్రగ్స్ వాడినట్టు తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీ, నిర్భయ్, కేదార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఆరుగురి కోసం వేట ప్రారంభించారు. నిందితుల నుంచి కొకైన్ వాడిన కవర్లు, డ్రగ్స్‌కు ఉపయోగించిన పేపర్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివేకానంద బీజేపీ నేత కొడుకు కాగా, కేదార్ అలియాస్ కేదార్‌నాథ్ పలు కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నాడు. సినిమా నిర్మాతగానూ వ్యవహరిస్తున్నట్టు సమాచారం. వీరిద్దరి సెల్‌ఫోన్లను విశ్లేషిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వారు ముందుగానే ఫోన్లలోని డాటాను డిలీట్ చేశారని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయంతో ఆ సమాచారాన్ని రిట్రీవ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేసులో మొత్తం పది మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే పలువుర్ని అరెస్ట్ చేసిన పోలీసులు.. మిగతా వారి కోసం గాలిస్తున్నారు.



# సినిమా తీరు

## 1న విడుదల కాబోతున్న మా ఊరి రాజారెడ్డి




నిహాన్, వైష్ణవి కాంబ్లే జంటగా రవి బాసర దర్శకత్వంలో ఆర్ ఎస్ మూవీ మేకర్స్ పై రజిత రవీందర్ , ఎర్ర, సునీత వెంకటరమణ అయిత నిర్మాతలుగా నిర్మిస్తున్న చిత్రం మా ఊరి రాజారెడ్డి. ఇటీవల విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ కి మంచి స్పందన లభిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. మార్చ్ 1న గ్రాండ్ గా ఈ సినిమాని ప్రేక్షకులు ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేణుగోపాల చారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మా ఊరి రాజారెడ్డి అనే సినిమా స్వర్గీయ రాజశేఖర్ రెడ్డిని గుర్తుకు చేసేలా ఉంటుంది. ఆయన అంచలంచెలుగా రాజకీయాల్లో ఒక నిష్ణాతుడైన ముఖ్యమంత్రిగా ఎదిగిన కథను మన ముందుకు తీసుకొస్తున్నారు. ఆయన మంచితనానికి నిదర్శనంగా ఈ చిత్రాన్ని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన వాళ్లు, సాంకేతిక నిపుణులంతా నిర్మల్ ప్రాంతం వాళ్ళవడం నిజంగా ఆనందదాయకం అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ ఒక ముఖ్య ప్రాంతంగా మారి ఇక్కడ నుంచి మన తెలుగు సినిమాలు ప్రపంచ స్థాయికి ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేడు తెలంగాణలో నిర్మల్, అదిలాబాద్, వరంగల్ లాంటి ప్రదేశాల్లో చాలా అద్భుతమైన లొకేషన్స్, వాటర్ ఫాల్స్, అటవీ ప్రాంతాలు ఉన్నాయన్నారు. ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత వెంకటరమణ మాట్లాడుతూ.. మా ఊరి రాజారెడ్డి సినిమాని నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చిత్రీకరించామని, ఖచ్చితంగా ఈ సినిమా మంచి సక్సెస్ అవుతుందని, ప్రేక్షకుల ఆశీస్సులు మాపై ఉండాలన్నారు. హీరో నిహాన్ మాట్లాడుతూ.. నేను సినిమాలో నటించడానికి మా అమ్మ నన్ను ప్రోత్సహించిందని,. ఈ సినిమాకి నన్ను సెలెక్ట్ చేసుకున్నందుకు మా డైరెక్టర్, ప్రొడ్యూసర్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా అన్నారు. చాలా కష్టపడి సినిమాని చేశామని, ప్రేక్షకులు చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడుతూ.. ఇది నాకు మొదటి సినిమా అని.. మా పేరెంట్స్ ని నెమ్మదిగా ఒప్పించి ఇండస్ట్రీలోకి వచ్చానని.. నన్ను ఈ క్యారెక్టర్ కి సెలెక్ట్ చేసుకున్నందుకు కృతజ్ఞతలని, కచ్చితంగా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని.. మీ అందరి ఆశీస్సులు మాపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. కో డైరెక్టర్ రవీంద్ర సిద్దార్థ మాట్లాడుతూ.. నేను పూరి జగన్నాథ్ గారికి వీరాభిమానినని.. మా డైరెక్టర్ ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ చేసి మధ్యలో వదిలేస్తే. సెకండ్ షెడ్యూల్ నేను పూర్తి చేశానన్నారు. హైదరాబాదులో ఉండే వాళ్ళకే కాకుండా టాలెంట్ అన్నిచోట్ల ఉంటుందని.. మేం నిర్మల్ నుంచి వచ్చామన్నారు. మాలాంటి దర్శకులని ప్రోత్సహించాలని కోరుకుంటున్నా అన్నారు. మీ అందరి సపోర్ట్ ఎప్పుడు మాపై ఉండాలని ఈ సినిమా మంచి సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నా అన్నారు.

## సైన్స్ ఫిక్షన్ మూవీగా ప్రభాస్ కల్కి




సలార్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్‌లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా టైటిల్‌పై ఇంట్రెస్టింగ్ న్యూస్ పంచుకున్నాడు దర్శకుడు నాగ్ అశ్విన్. ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' అని పెట్టినప్పటినుంచి ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ టైటిల్ 'కల్కి 2898 ఏడీ' అని పెట్టడానికి గల కారణాన్ని నాగ్ అశ్విన్ వెల్లడించారు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తవుతుంది. గతంతో మొదలై ఫ్యూచర్‌తో ముగుస్తుంది కాబట్టి ఈ టైటిల్ పెట్టాం. ఈ సినిమాలో మొత్తం 6000 ఏండ్ల మధ్య జరిగే కథను చూపించబోతున్నాం. దానికి తగ్గట్లు ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. అంటూ నాగ్ అశ్విన్ వెల్లడించాడు. ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. అత్యంత భారీ బ్జడెట్‌తో వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొణెళి, దిశా పటానీ, పశు పతి లాంటి సూపర్‌స్టార్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

## అందానికే మరో అందం....



## సోనీ ఝలక్ దిఖలా జాలో శ్రీరామచంద్ర



ఇండియన్ ఐడల్(2010) విన్నర్ శ్రీరామ చంద్ర గురించి తెలియని వారు లేరు. సంగీతమే శ్వాసగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఎనిమిదేళ్ల వయసు నుంచే పాడటం ప్రారంభించారు. ఎన్నో సంగీత పోటీల్లో పాల్గొని ట్రోఫీలు అందుకున్నారు. తెలుగులో విజయవంతమైన చిత్రాలకు పాటలు పాడిన ఆయన 2010లో ఇండియన ఐడల్ కాంపిటీషన్లో పాల్గొని విజేతగా గెలిచి తెలుగు వారి సత్తా చాటారు. తదుపరి ఆయన ఎన్నో చిత్రాల్లో పాటలు పాడి గుర్తింపు తెచ్చుకున్నారు. అంతే కాదు సినిమాల్లో హీరోగా నటించారు. పలు చిత్రాలు కీలక పాత్రలు పోషించారు. 2 ఏళ్ల తర్వాత ఆయన మరోసారి సోనీ టీవీలో సందడి చేయనున్నారు. సోనీ టీవీలో జరుగుతున్న సెలబ్రిటీ డాన్స్ షో 'ఝలక్ దిఖలా జా'లో శ్రీరామ చంద్ర పార్టిసిపేట్ చేస్తున్నారు. పోటీలో సెమీ ఫైనల్స్‌కి చేరుకున్నారు. ట్రోఫీ గెలవడానికి తెలుగువారంతా తమ ఓటుతో సపోర్ట్ చేయాలని సంగీత కళాకారులు పిలుపునిచ్చారు.


## గామి కోసం రంగంలోకి విశ్వక్.. మీరు రెడీనా?

టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఆయన నటించిన సినిమాలన్నీ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అవుతున్నాయి. ప్రతీ మూవీలో కొత్తదనం చూపిస్తున్నారు. మాస్ కా దాస్ గా అలరిస్తున్న విశ్వక్.. ఇప్పుడు సరికొత్త జోనర్ లో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. అడ్వెంచరెస్ ఫాంటసీ మూవీగా తెరకెక్కిన గామి మరో కొద్ది రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మానవ స్పర్శను తట్టుకోలేని అఘోర



శంకర్ గా విశ్వక్ సేన్ అలరించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్, పోస్టర్స్, టీజర్ మంచి హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పటి వరకు విశ్వక్ చేసిన సినిమాలకు పూర్తి భిన్నంగా గామి ఉండడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివరాత్రి కానుకగా విడుదల కానున్న ఈ మూవీ ట్రైలర్ ను ఫిబ్రవరి 29వ తేదీన రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. తాజాగా విశ్వక్ కూడా వీడియో మెసేజ్ ఇచ్చారు. "హాయ్.. 29వ తేదీ ఫిబ్రవరి లీప్ ఇయర్ రోజు ప్రసాద్ ఐమాక్స్ బిగ్ స్క్రీన్ లో పీసీఎక్స్ ఫార్మాట్ లో నాలుగు గంటలకు గామి ట్రైలర్ లాంఛ్. ట్రైలర్ అక్కడ చూస్తే మాత్రం చాలా కొత్త ఎక్స్పీరియన్స్ ఉంటుంది. నాలుగున్నరేళ్లుగా ఈ చిత్రం కోసం కష్టపడుతున్నాం. కాబట్టి ఆ ఎక్స్పీరియన్స్ ను మిస్ అవ్వొద్దు. ఫిబ్రవరి 29వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఐమాక్స్ బిగ్ స్క్రీన్ లో లాంచ్. నేను కూడా వస్తున్నా" అంటూ విశ్వక్ మాట్లాడుతున్న వీడియోను మేకర్స్ షేర్ చేశారు. అయితే హైదరాబాద్ లోని ప్రసాద్ మల్టీప్లెక్స్ అంటే చాలా మంది ప్రేక్షకులకు ఫేవరెట్ థియేటర్ అని చెప్పాలి. అందులో పీసీఎక్స్ స్క్రీన్ కు మంచి డిమాండ్ ఉంటుంది. అలాంటి సూపర్ స్క్రీన్ పై గామి ట్రైలర్ రిలీజ్ అంటే వేరే లెవల్. కచ్చితంగా సినిమాలోని అన్ని టెక్నికల్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు క్లియర్ గా తెలుస్తాయి. నాలుగున్నరేళ్లుగా షూటింగ్ జరుపుకున్న ఈ మూవీ హిట్ అవుతుందని మేకర్స్ నమ్మకంతో ఉన్నారు. మార్చి 8వ తేదీన రిలీజ్ కానున్న ఈ మూవీలో చాందినీ చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఆమె క్యారెక్టర్ ను మేకర్స్ రివీల్ చేశారు. విద్యాధర్ కాగిత దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఎంజీ అభినయ, మహ్మద్ సమద్, దయానంద్ రెడ్డి, హారికా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీ సెల్యూలాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. మరి గామి మూవీ ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.

## జుట్టు రాలడం అసాధారణంగా మారుతుంది, ఈ విషయాలను గమనించండి..



జుట్టు రాలడం అనేది ప్రతి ఒక్కరికీ వస్తుంది. అయితే ఇది మామూలుగా మారకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణ పరిస్థితుల్లో రోజుకు 50 నుంచి 100 వెంట్రుకలు రాలిపోతాయి. ఉదయం లేదా స్నానం చేసిన తర్వాత మీ దిండుపై కొంత వెంట్రుకలు కనిపించడం సాధారణం. మీరు కోల్పోయే జుట్టు మొత్తం దాని పొడవు మరియు మందంపై ఆధారపడి ఉంటుంది మరియు మీరు పడుకునే దిండు కూడా తరచుగా జుట్టు రాలడానికి దోహదం చేస్తుంది. అయితే జుట్టు రాలడం సాధారణం కంటే ఎక్కువగా ఉంటే మాత్రం జాగ్రత్త పడాలి. ఇది మిమ్మల్ని ప్రమాదకరమైన పరిస్థితిలో ఉంచుతుంది. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండండి. జుట్టు ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి ఏమి చూడాలో చూద్దాం. అంతేకాదు, మీ జుట్టు రాలడం విపరీతంగా ఉందో లేదో తెలుసుకోవడానికి మనం కొన్ని విషయాలు వెతకవచ్చు. దాని గురించి తెలుసుకోవడానికి చదవండి. మీరు సాధారణం కంటే ఎక్కువగా రాలిపోతుంటే చెప్పడానికి ఒక మార్గం ఏమిటంటే మీ జుట్టు పట్టుకుని మెల్లగా లాగడం. మీరు సరైన మొత్తంలో జుట్టును కోల్పోతే, 3 కంటే ఎక్కువ వెంట్రుకలు రాలవు. కానీ మీకు అసాధారణంగా జుట్టు రాలిపోతే జుట్టు రాలిపోయే సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మీకు మరింత ప్రమాదాలను కలిగిస్తుంది. ఈ స్థితిలో, జుట్టును జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా మాత్రమే జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. మీరు స్నానం చేసిన తర్వాత బాత్రూంలో ఎంత జుట్టు పడి ఉందో మీరు చూడవచ్చు. తలస్నానం చేస్తే కొన్ని వెంట్రుకలు రాలిపోవడం సహజం. కానీ ఆ తర్వాత దువ్వేన మరికొన్ని కోల్పోవచ్చు. కానీ మీరు మీ బాత్రూమ్ ఫ్లోర్‌లో చాలా జుట్టును నిరంతరం గమనిస్తే, అది అధిక జుట్టు రాలడానికి సంకేతం కావచ్చు. ఈ విషయాలను పెద్దగా పట్టించుకోకపోవడం ముఖ్యం. ఎందుకంటే మీలో ఎక్కువ సమస్యలు మరియు ఒత్తిడి ఉన్నాయన్నది నిజం. మీకు అధిక జుట్టు రాలుతుందో లేదో తెలుసుకోవడానికి మరొక మార్గం ఏమిటంటే, మీ జుట్టును 60 సెకన్ల పాటు బ్రష్ చేయండి మరియు రాలిపోయే వెంట్రుకల సంఖ్యను లెక్కించండి. దాదాపు 10 వెంట్రుకలు రాలడం సాధారణం, మరియు మీకు ఎన్ని వెంట్రుకలు వచ్చినా, మీరు అధిక జుట్టు రాలడం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇది తరచుగా మరిన్ని సవాళ్లను సృష్టిస్తుంది. మీరు మీ జుట్టును కట్టుకునే విధానం కూడా మీ జుట్టు ఆరోగ్యాన్ని తెలియజేస్తుంది. జుట్టు పల్చబడటం అనేది మీరు డాక్టర్‌ని సంప్రదించవలసిన సంకేతాలలో ఒకటి. గణనీయమైన వ్యత్యాసం ఉన్నంత వరకు మీరు దానిని గమనించనప్పటికీ, ఇది గణనీయమైన జుట్టు రాలడాన్ని సూచిస్తుంది. పోనీటైల్‌ని చూసి జుట్టు మందాన్ని చెప్పవచ్చు. బట్టతల అనేది పురుషులలోనే కాదు స్త్రీలలో కూడా వస్తుంది. ముందుగా చేయవలసినది బట్టతల కోసం మీ స్కాల్ప్ చెక్ చేసుకోవడం. మీరు క్రమం తప్పకుండా జుట్టు రాలడాన్ని అనుభవిస్తే, మీరు మీ తలపై బట్టతల కూడా కావచ్చు. మీరు సన్నబడటానికి పాచెస్ గమనించినట్లయితే, ఇది జుట్టు రాలడానికి మొదటి సంకేతాలలో ఒకటి



కావచ్చు. కాబట్టి తెలుసుకోవలసిన విషయం ఏమిటంటే దానిని ఎప్పుడూ పెద్దగా పట్టించుకోకూడదు. నిద్రపోతున్నా 5 నుంచి 20 వెంట్రుకలు రాలడం సహజం. ముఖ్యంగా మీరు కాటన్ దిండుపై పడుకుంటే జాగ్రత్తగా ఉండండి. అవి మీ జుట్టు నుండి తేమను గ్రహిస్తాయి. ఇది జుట్టును పొడిగా మరియు పెళుసుగా చేస్తుంది. కానీ మీరు ఉదయాన్నే మీ దిండుపై చాలా వెంట్రుకలను చూడటం ప్రారంభిస్తే, మీరు అధిక జుట్టు రాలడాన్ని ఎదుర్కొంటున్నారనే సంకేతం కావచ్చు. కాబట్టి మీరు పైన పేర్కొన్న ఏవైనా లక్షణాల ద్వారా ప్రభావితమైతే, మీరు దానిని గుర్తించి, నివారణను కనుగొనాలి.

## గురువును మించిన శిష్యుడు.. ప్రత్యేక రికార్డులో జురెల్.. ధోని, పంత్‌లకూ సాధ్యంకాలే.. అదేంటంటే?




5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో నాలుగో మ్యాచ్‌లో భారత జట్టు 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. రాంచీ టెస్టులో ధృవ్ జురెల్ భారత్ విజయానికి హీరోగా మారాడు. టీమిండియా తరపున రెండు ఇన్నింగ్స్‌లలో బ్యాట్‌తో కీలక సహకారాన్ని అందించాడు. ఇటువంటి పరిస్థితిలో, అతను ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. దీంతో ధృవ్ జురెల్ పేరిట ఓ ప్రత్యేక రికార్డు చేరింది. భారత దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, రిషబ్ పంత్ కూడా చేయలేని పనిని అతను చేశాడు. ధృవ్ జురెల్ ధోనిని తన గురువుగా భావిస్తాడు. ధోనీ సొంత మైదానం రాంచీలోనే అతడు ఈ ఘనత సాధించడం విశేషం. ధృవ్ జురెల్ తన కెరీర్‌లో రెండో టెస్టు మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్న తొలి భారతీయ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ అయ్యాడు . అంతకుముందు అజయ్ రాత్రా 3వ టెస్టులో, నయన్ మోంగియా 14వ టెస్ట్‌లో, రిషబ్ పంత్, వృద్ధిమాన్ సాహా 16వ టెస్ట్‌లో, మహేంద్ర సింగ్ ధోనీ 31వ టెస్టులో ఈ ఘనత సాధించారు.

అరంగేట్రం తర్వాత మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్న టీమిండియా వికెట్లు కీపర్లు..

ధృవ్ జురెల్: 2అజయ్ రాత్ర: 3నయన్ మోంగియా: 14రిషబ్ పంత్: 16వృద్ధిమాన్ సాహా: 16మహేంద్ర సింగ్ ధోని: 31నాలుగో టెస్టులో ధృవ్ జురెల్ ప్రదర్శన గురించి మాట్లాడితే, అతను కేవలం 1 అర్ధ సెంచరీ మాత్రమే చేశాడు. కానీ, విజయంలో అతనిది కీలక సహకారం. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ కోల్పోయాడు. అతను 149 బంతుల్లో 90 పరుగుల ముఖ్యమైన ఇన్నింగ్స్ ఆడాడు. కాగా, టీమ్ ఇండియా 250 పరుగులు కూడా చేయలేదేమో అనిపించేది. ఇలాంటి పరిస్థితుల్లో కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్ వంటి బౌలర్లతో కలిసి బ్యాటింగ్ చేసిన ధ్రువ్ జురెల్ జట్టు స్కోరును 300 దాటించాడు. అలాగే, రెండో ఇన్నింగ్స్‌లో ధృవ్ జురెల్ 77 బంతుల్లో 39 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్ కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ ధృవ్ జురెల్‌ను కౌగిలించుకుని, అభినందించారు. రాజ్‌కోట్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో ధృవ్ జురెల్ రాజ్‌కోట్‌లో అరంగేట్రం చేశాడు. తన అరంగేట్రం మ్యాచ్‌లో, అతను మొదటి ఇన్నింగ్స్‌లో 104 బంతుల్లో 46 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతను 2 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ధృవ్ జురెల్ ప్రదర్శన గురించి మాట్లాడితే, అతను ఇప్పటివరకు ఆడిన 17 మ్యాచ్‌లలో 22 ఇన్నింగ్స్‌లలో 965 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతని సగటు 50.78, స్ట్రైక్ రేట్ 55.94. అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 6 అర్ధ సెంచరీలు, 1 సెంచరీ సాధించాడు.

## అలాంటి వాళ్లను జట్టులోకి తీసుకోం: రోహిత్ అసహనం

టెస్టు జట్టు కూర్పు గురించి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న వాళ్లకే టీమ్‌లో స్థానం ఉంటుందన్నాడు. ముఖ్యంగా టెస్టు క్రికెట్ ఆడాలనే తపన ఉన్న వాళ్లకే మొదటి ప్రాధాన్యం ఇస్తామంటూ మేనేజ్‌మెంట్ వైఖరిని రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. కాగా తిరిగి టెస్టు జట్టులోకి రావాలంటే కచ్చితంగా రంజీల్లో ఆడాలంటూ బీసీసీఐ కార్యదర్శి జై షా ఇటీవల క్లారిటీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్, మిడిలార్డర్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్ మాత్రం బోర్డు ఆదేశాలను పట్టించుకున్నట్లు కనిపించలేదు. జార్ఖండ్ తరఫున ఇషాన్ బరిలోకి దిగకపోగా.. అయ్యర్ ముంబై క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌కు ఫిట్‌నెస్ కారణాలు చూపిదూరమయ్యాడు. ఇదిలా ఉంటే.. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, మహ్మద్ షమీ వంటి కీలక ఆటగాళ్లు జట్టులో లేని నేపథ్యంలో నలుగురు కొత్త ఆటగాళ్లు టెస్టుల్లో అరంగేట్రం చేశారు. రజత్ పాటిదార్, సర్ఫరాజ్ ఖాన్, వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, పేసర్ ఆకాశ్ దీప్ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టారు. వీరిలో రజత్ పాటిదార్ తప్ప మిగతా ముగ్గురు సత్తా చాటారు. ముఖ్యంగా సిరీస్ విజయానికి కీలకమైన నాలుగో టెస్టులో ధ్రువ్ జురెల్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. జట్టును గెలిపించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.